క్లుప్తంగా

మాణిక్యరావుకు డాక్టరేట్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగ పరిశోధకుడు కె. మాణిక్యరావుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ ఆచార్య పి. కిరణ్మయి తెలిపారు. ఆయన న్యాయశాస్త్ర విభాగ పరిశోధనా పర్యవేక్షకులు శ్రీగౌరి పర్యవేక్షణలో ' హ్యూమన్ రైట్స్ ఇన్ లేబర్ జ్యూరిస్ ప్రుడెన్స్ – ఏ స్టడీ ఆన్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినట్లు పేర్కొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు

కొరిటిపాడు (గుంటూరు): అమరావతి రోడ్డులోని హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు నిర్వహించారు. కార్గిల్ యుద్ధం పూర్వాపరాలు, వ్యూహాత్మంగా భారతీయ సైన్యం గెలుపు అనే అంశాలపై వీడియోను ప్రదర్శించారు. 'కార్గిల్ దివస్–దేశభక్తి'పై ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా ఎంబీఏ అమృత, ప్రవీణ్, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ నుంచి హర్ష వర్ధిని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల్ని గెలుపొందారు. ఆద్యంతం ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల దేశభక్తి గీతాలాపన ముఖ్య అంశంగా నిలిచింది. అనంతరం విద్యార్థులు, అధ్యాపక బృందాలు కార్గిల్ వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి. రమణ, ఎంబీఏ హెచ్‌ఓడీ వి.చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కల్యాణి, అనిత, అభిలాష్, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా ఎరువులు తెప్పించుకోండి

పెదకాకాని: ఖరీఫ్ సీజన్‌లో రైతు భరోసా కేంద్రాల పరిధిలో అవసరమైన ఎరువులకు ఆర్డర్ చేయాలని గుంటూరు సబ్ డివిజన్ ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని రైతు భరోసా కేంద్రంలో బుధవారం వీఏఏల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది పెదకాకాని మండలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా 4,363 మెట్రిక్ టన్నులు ఎరువులు రైతులకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆగస్టు మొదటి వారంలో ఈ క్రాఫ్ బుకింగ్ చేయాల్సి ఉంటుందని, వీఏఏలు ఆయా రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉన్న రైతులు, పంట వివరాలు సేకరించి అందుబాటులో పెట్టుకోవాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి 14వ విడత నగదు గురువారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ఈకేవైసీ 87 శాతం మాత్రమే పూర్తి అయిందని, పెండింగ్‌లో ఉన్న రికార్డులు కూడా వారం రోజుల్లో పూర్తి చేయాలని వీఏఏలకు సూచనలు చేశారు. త్వరలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ) ఇచ్చే ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఎక్కువ మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి సంధ్యారాణి, ఏఈఓ రామమోహన్, వీఏఏలు పాల్గొన్నారు.

నల్లమడ వాగులో యువకుడి మృతదేహం లభ్యం

పెదనందిపాడు: నల్లమడ వాగులో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని నాగులపాగు గ్రామ సమీపంలో నల్లమడ వాగు వద్ద గుర్తు తెలియని 45 సంవత్సరాల యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారి సమాచారం వాగులో ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి కుడిచేతిపై జి. నరసమ్మ అనే పేరు పచ్చబొట్టు ఉన్నదని, వివరాలు తెలిసిన పెదనందిపాడు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ కోరారు. వీఆర్వో జయప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

విజ్ఞాన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



చేబ్రోలు: మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని యూఈఏసీ (యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ కౌన్సిల్) ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీ దత్త గ్రామమైన చేబ్రోలు మండలం శలపాడులో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఉచిత కంటి వైద్య శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాల్ని నిర్వహించారు. గుంటూరులోని డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్యుల బృందం ఆధ్వర్యంలో గ్రామస్తులకు కంటి పరీక్షల్ని నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు కంటి వ్యాధులు, శుక్లాలను ముందస్తుగా గుర్తించడం ఎలా అనే అంశాలపై అవగాహనతో పాటు తీసుకోవల్సిన జాగ్రత్తల్ని తెలియజేశారు. శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 110 మందికి అవసరమైన కళ్లజోళ్లు, మందులు అందించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు, శలపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హెపటైటిస్... బీ కేర్ ఫుల్

గుంటూరుకు చెందిన 35 ఏళ్ల సురేష్ ప్రతిరోజూ మద్యం తాగుతూ ఆరోగ్యంపై దృష్టి సారించలేదు. తనకేమి సమస్య లేదని నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుండిపోయాడు. ఒకరోజు కళ్ల పసుపురంగులోకి మారడంతో గ్యాస్ట్రోఎంట్రాజిస్టు వద్దకు వెళ్లాడు. పరీక్షలు చేసి లివర్ పూర్తిగా పాడైందని, మార్పిడి చేసినా బతకడం కష్టమని చెప్పడంతో కుటుంబ సభ్యులు కంగుతిన్నారు. లివర్ సమస్యల్ని ముందస్తుగా గుర్తించకుండా అశ్రద్ధ చేయడం వల్లే సురేష్ చిన్న వయస్సులోనే తనువు చాలించాడు.

- రేపు వరల్డ్ హెపటైటిస్ డే
- వ్యాధి సోకితే ప్రాణాంతకం
- వ్యాక్సిన్‌తో అడ్డుకట్ట

గుంటూరు మెడికల్: ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా హెపటైటిస్–బి, హెపటైటిస్–సి వ్యాధితో 354 మిలియన్ల మంది బాధపడుతున్నారు. ప్రతి రోజూ ప్రపంచ వ్యాప్తంగా 3,000 మంది మరణిస్తున్నారు. వ్యాధి సోకినవారిలో 90శాతం మందికి చికిత్సలపై అవగాహన లేదు. దీంతో వరల్డ్ హెల్త్ అసెంబ్లీ 2010 జూలై 28న హెపటిటిస్ డేను నిర్వహించాలని నిర్ణయించింది. 2030 నాటికి హెపటైటిస్ లేని ప్రపంచాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా హెపటైటిస్ డేను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి ' అందిస్తున్న ప్రత్యేక కథనం.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం

హెపటైటిస్ కాలేయానికి సంబంధించిన వ్యాధి. వైరస్ ద్వారా సోకుతుంది.అది శరీరంలోకి ఒకసారి వస్తే క్రమేపీ సంఖ్య లక్షల్లో పెరిగిపోయి లివర్‌ను దెబ్బతీస్తుంది. ఇందులో ఎ, బి, సి,డి, ఈ రకాలు ఉన్నా వాటిలో బి, సి ప్రాణాంతకం. వ్యాధి సోకిన వారిలో ఏ విధమైన లక్షణాలు కనిపించకపోవడంతో వారి ద్వారా ఇతరులకు సోకుతుంది. వయస్సుతో సంబంధం లేకుండా అందరికీ సోకుతుంది.హెచ్‌బీఎస్ఏజీ పరీక్ష ద్వారా సోకిందా.. లేదా ? అని నిర్ధారణ చేస్తారు.



హెపటైటిస్ డే పోస్టర్

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం

గుంటూరు జీజీహెచ్‌లో 2021 నుంచి ప్రత్యేకంగా హెపటైటిస్ స్క్రీనింగ్ సెంటర్ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు. సెంటర్ ప్రారంభం నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 13,270 మందికి హెపటైటిస్ బి అనుమానంతో పరీక్షలు చేయగా, 622 మందికి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. హెపటైటిస్ స్క్రీనింగ్ పరీక్షలు 6,924 మందికి చేయగా 321 మందికి ఉన్నట్లు తేలింది. ఈ సెంటర్‌లో హైపటైటిస్ నియంత్రణ , నివారణ కోసం ఉచితంగా వ్యాక్సిన్లు, మందులు, వైద్యసేవలు అందిస్తున్నారు.

వ్యాధి సోకే విధానం

- ఇన్‌ఫెక్ట్ అయిన రక్తపు ఉత్పత్తులు
- శరీరంలో ఊరే వివిధ ద్రవాలు (వీర్యం, యోని స్రవాలు,మూత్రం)
- సురక్షితం కాని సంభోగం, అనేక మందితో సంభోగం
- ఒకరికి వాడిన ఇంజెక్షన్ సూదిని వేరొకరికి వాడటం
- టాటూలు వేసుకోవడం,
- ముక్కు, చెవులు కుట్టుకోవడం, ఒక రేజర్ బ్లేడ్‌ను అనేక మంది వాడటం
- ఒకరు వాడిన టూత్ బ్రష్‌ను మరొకరు వాడటం,
- అసురక్షితమైన రక్తదానం
- వైరల్ కల్గిన గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు వ్యాధి సోకుతుంది

వ్యాధి లక్షణాలు

- కాలేయం వాచిపోయి మూత్రం పసుపు పచ్చగా వస్తుంది.
- కళ్లు, శరీరం, నాలుక తదితర భాగాలన్నీ పసుపు పచ్చగా మారిపోతాయి. దీనినే పచ్చకామెర్లు అంటారు.
- వ్యాధి ప్రారంభ దశలో తేలికపాటి జ్వరం, ఆకలి మందగించి వాంతులవుతాయి
- మనిషి బాగా బలహీనపడటం, కీళ్ల నొప్పులు ఉంటాయి.
- కొంతమంది పరిస్థితి ఇంకా భయంకరంగా ఉంటుంది. కాలేయం సరిగా పనిచేయక మృత్యువుకు దారితీస్తుంది.

వ్యాక్సిన్‌తో చెక్



హెపటైటిస్– బి వ్యాధి సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్ చేయించుకోవడం ద్వారా బారిన పడకుండా ఉండొచ్చు. వచ్చాక నయం కాదు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు వ్యాక్సిన్లు చేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. కుటుంబంలో ఒకరికి ఉంటే ఇతర కుటుంబ సభ్యులకు సోకకుండా వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చు. హెపటైటిస్–సి వ్యాధికి వ్యాక్సిన్ లేదు గానీ ముందస్తుగా గుర్తిస్తే వైద్యం చేసి నయం చేయవచ్చు. లివర్ మార్పిడి ఆపరేషన్లు సైతం గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్.

లివర్ క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం



లివర్ క్యాన్సర్లు రావడానికి హెపటైటిస్– బి, సి వ్యాధులే కారణం. కామెర్ల వ్యాధి సోకిన వారు తప్పని సరిగా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి. శరీరంలో హెపటైటిస్ ఆరు నెలల కంటే ఎక్కువ కాలం ఉంటే క్రానిక్ హెపటైటిస్‌కు దారితీసి కొన్నేళ్ల తరువాత లివర్ దెబ్బతినటానికి కారణమవుతుంది. దీని వల్ల లివర్ క్యాన్సర్, లివర్ ఫెయిల్యూర్, లివర్ సిరోసిస్ వస్తుంది.

– డాక్టర్ ఎం.జి. నాగకిశోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

పరుగులు పెడుతున్న నగరాభివృద్ధి

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో గుంటూరు నగరాభివృద్ధి పరుగులు పెడుతోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని 11వ డివిజన్ ఆనందపేట 2, 3 లైన్లలో రూ. 60లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రూ. 1కోటితో ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు సైతం నోరు మెదపలేని విధంగా అభివృద్ధి పనులు రాష్ట్రంలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తిరిగి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నేత షేక్ నూరి ఫాతిమా, కార్పొరేటర్లు అబీద్ బాషా, రామనబోయిన అజయ్‌యాదవ్, సంకూరి శ్రీను, వేమూరి జ్యోతి, ఫర్హాన్, అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా తదితరులు

బ్రాహ్మణులకు తీరని ద్రోహం చేసిన టీడీపీ



కోనూరు సతీష్‌శర్మ

పట్నంబజారు: టీడీపీ ఆవిర్భావం నుంచి బ్రాహ్మణులకు తీరని ద్రోహం చేసిందని, ఆ పార్టీకి బ్రాహ్మణుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యుడు కోనూరు సతీష్ శర్మ ధ్వజమెత్తారు. గుంటూరు నగరాల్లోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల వైజాగ్‌లో టీడీపీ బ్రాహ్మణ సాధికారత పేరుతో సింహాచలంలో, విజయనగరంలో సభలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కమిటీ కన్వీనర్ బుచ్చిరాం ప్రసాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బ్రాహ్మణ ద్రోహి అని వ్యాఖ్యానించడం సిగ్గుచేటని ఖండించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కనీసం బ్రాహ్మణులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం ఇవ్వలేదని, 35 ఏళ్లుగా ఆ పార్టీ చేస్తున్న ద్రోహం ప్రతి ఒక్కరికీ తెలుసని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గురించి ప్రస్తావించే అర్హత చంద్రబాబు, బుచ్చిరాంప్రసాద్‌కు లేదని విమర్శించారు. మూడు అసెంబ్లీ స్థానాలు ఇచ్చి వైఎస్సార్ సీపీ గెలిపించిందన్న విషయాన్ని బ్రాహ్మణ జాతి గుర్తుంచుకుందన్నారు. చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో మున్సిపల్ చైర్మన్‌గా ఒక బ్రాహ్మణ డాక్టర్ సు. దీర్‌ను గెలిపించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. టీడీపీ బ్రాహ్మణల్ని కేవలం కరివేపాకులా వాడుకుని వదిలేసిందని, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గుర్తొచ్చారా? అని ప్రశ్నించారు. 1984లో కరణీకాల వ్యవస్థ, 1987లో వంశపారంపర్య అర్చకత్వం తొలగించింది టీడీపీ హయాంలోనే అని గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ. 500 కోట్లు హామీ ఇచ్చి, ఐదేళ్లలో రూ. 280 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్న ఘనత టీడీపీకే దక్కుతుందని విమర్శించారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు దేవదాయ శాఖలో 33/2007 చట్ట సవరణ చేశారన్నారు. దీనివల్ల చట్టసభల్లో అవకాశం కల్పించటంతో పాటు, నామినేటడ్ పోస్టుల్లో సైతం బ్రాహ్మణులకు అవకాశం కల్పించారని తెలిపారు. తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం జగన్ బ్రాహ్మణులకు చట్టసభల్లో అవకాశం కల్పించడంతో పాటు జీవో నంబర్ 439 ద్వారా వంశపారంపర్య అర్చకత్వాన్ని అమలు చేశారని సతీష్‌శర్మ వివరించారు. అర్చకుల వయస్సు కూడా పెంచడంతో పాటు కరోనా వంటి కల్లోల సమయంలో కూడా వారికి రూ. 5వేలు అందజేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. నవరత్న పథకాల్లో ఏడాదికి 2లక్షల 50 వేలకు పైగా బ్రాహ్మణ కుటుంబాలు లబ్ధి పొందుతున్నారని, ఎవరి ప్రభుత్వంలో మంచి జరిగిందో బ్రాహ్మణులు ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

డోర్ టు డోర్ సర్వే నిర్దేశిత గడువులోగా పూర్తి చేయండి

నెహ్రూనగర్: స్పెషల్ సమ్మరీ రివిజన్– 2024 ఓటర్ల జాబితాకి సంబంధించి డోర్ టు డోర్ సర్వేను బీఎల్‌ఓలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని నగర అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదేశించారు. ఆమె బుధవారం కొత్తపేట మెడికల్ కాంప్లెక్స్ ప్రాంతంలో డోర్ టు డోర్ ఓటర్ సర్వేని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్వే పక్కాగా జరగాలని చెప్పారు. ప్రధానంగా ఒకే డోర్ నంబర్‌లో ఎక్కువ ఓట్లు, జీరో డోర్ నంబర్, జంక్ క్యారెక్టర్‌లు ఉన్న వాటిని ప్రత్యేకంగా పరిశీలన చేయాలని సూచించారు. వయస్సు 100 పైబడిన వారి వయస్సు ధ్రువీకరణ పత్రాల్ని పరిశీలించాలని చెప్పారు. బీఎల్‌ఓ యాప్‌లో ఎక్కడైనా సమస్య ఎదురైతే వెంటనే నగరపాలక సంస్థ ఎన్నికల విభాగ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. నగరపాలక సంస్థ నుంచి అందించిన గుర్తింపు కార్డులను ధరించి సర్వేలో పాల్గొనాలని సూచించారు. బీఎల్‌ఓలతో పాటుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజంట్లు కూడా సర్వేలో పాల్గొనవచ్చని ఆమె వెల్లడించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సూపర్‌వైజర్లు రవికుమార్, హయాషా వలి, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మ పాల్గొన్నారు.



డోర్ టు డోర్ సర్వే పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా

భవన నిర్మాణ కార్మికుడి మృతి

గుంటూరు ఈస్ట్: సెంట్రింగ్ కార్మికుడు భవనం పైనుంచి కిందపడి మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. తాడికొండ మండలం తాతిరెడ్డిపాలేనికి చెందిన కఠారి అశోక్ (33) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వికాస్‌నగర్ 3వ లైనులో నిర్మాణంలో ఉన్న భవనంలో బుధవారం పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

పేకాట ఆడుతున్న ముగ్గురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేటలోని ఓ లాడ్జిలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 9వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవ్యవస్థపై అవగాహనకే సదస్సులు

- సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జి.చంద్రమౌళేశ్వరి
- కిట్స్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళేశ్వరి

గుంటూరు రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయవ్యవస్థ గురించి తెలియజేయాలని ఉద్దేశంతో న్యాయ విజ్ఞాన సదస్సుల్ని నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జి.చంద్రమౌళేశ్వరి తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని కిట్స్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ప్రధానమైన భాగంగా పరిగణించబడతారన్నారు. కొందరు తెలిసీ తెలియక అపరాధాలు చేసి వారి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులకు లోక్ అదాలత్, భారతీయ చట్టాల గురించి వివరించారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ పి.వి. రాంబాబు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు చేసే అపరాధాలు, చట్టపరంగా పడే శిక్షల గురించి వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ప్రజలకు ఏవిధంగా చట్టాలు సహాయం అందిస్తున్నాయో తెలిపారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు , క్షణికావేశంలో చేసే ఆలోచనల మూలంగా జీవితాలు ఏవిధంగా నాశనమవుతున్నాయో వివరించారు. ర్యాగింగ్ తదితర అపరాధాలు చేసి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు, డైరెక్టర్ కె.హరిబాబు, కె.చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు

అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం

నెహ్రూనగర్: ప్రస్తుత వర్షాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. పూడిక తీసిన అవుట్ ఫాల్ డ్రెయిన్స్‌లో ఎక్కడైనా నీరు నిలిస్తే మరలా తీయించాలని చెప్పారు. ఆమె బుధవారం రామిరెడ్డితోట, కొత్తపేట, గుంటూరువారితోటలోని పలు ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రెయిన్‌ని పరిశీలించారు. తీసుకోవల్సిన చర్యలపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పూడికతీత పనులకు వర్షాకాలానికి ముందే అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. ఎక్కడైనా పనులు పెండింగ్ ఉంటే యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. పూడిక తీసిన డ్రెయిన్లలో నీరు నిలిచినా, ఫిర్యాదులు వచ్చినా సదరు కాంట్రాక్టరే తిరిగి తీయాలని చెప్పారు. పూడిక తీతకు ముందు తర్వాత ఫోటోలు పెట్టాలని, లేనిపక్షంలో బిల్లుల మంజూరు జరగదని స్పష్టం చేశారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న నేపథ్యంలో అధికారులు, నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు సంబంధిత సచివాలయం కార్యదర్శులతో కలసి తమకు కేటాయించిన ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల సమస్యల్ని గుర్తించాలని కమిషనర్ ఆదేశించారు.ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో మోటార్ల ద్వారా బెయిల్ అవుట్ చేయాలని సూచించారు. గాలుల వల్ల విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడినా తాగునీటి సరఫరాకి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా పంపింగ్ కేంద్రాల్లో జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. పనుల్ని సంబంధిత ఏఈ, డీఈఈలు నేరుగా పర్యవేక్షణ చేయాలని కమిషనర్ తెలిపారు. రోడ్ల మీద ఎక్కడైనా చెట్లు పడితే వాటిని వెంటనే తొలగించడానికి పార్క్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. శిథిలావస్థ భవనాలలో నివాసం ఉంటున్న వారికి ముందస్తు జాగ్రత్తలు తెలియజేయాలని సచివాలయ కార్యదర్శుల్ని ఆదేశించారు. నగర ప్రజలు స్థానికంగా ఎక్కడైనా సమస్యలు ఎదురైతే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863–2345103 నంబర్‌కి కాల్ చేయవచ్చని కమిషనర్ తెలిపారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.



కొత్తపేటలో పర్యటిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించండి

గుంటూరు నగరాభివృద్ధికి బిల్డర్స్ ముందుకు రావాలని, నిర్దేశిత పన్నులు సకాలంలో చెల్లించి సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులతో కమిషనర్ సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత బిల్డర్స్ సమస్యలు, నగరపాలక సంస్థ తరపున అందించాల్సిన సహకారంపై అడిగి తెలుసుకొన్నారు. నగరాభివృద్ధిలో బిల్డర్స్ కూడా భాగస్వాములు కావాలని కోరారు. భవన నిర్మాణ ప్లాన్ కోసం దరఖాస్తు చేసే సమయంలోనే నిబంధనల మేరకు పన్నులు చెల్లించడంతో పాటు ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపట్టాలని సూచించారు. నగరంలో సర్వేయర్లు ప్రస్తుతం అందుబాటులో లేకపోవడం వల్ల సమస్యగా ఉన్నదని, త్వరలో నగరపాలక సంస్థకు వస్తారని కమిషనర్ తెలిపారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ దరఖాస్తుకి ముందే రెవెన్యూ విభాగం నుంచి సదరు భవనానికి సంబంధించి ఖాళీ స్థల పన్ను, ఇతర పన్నులపై ఎన్‌ఓసి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. అప్రూవ్డ్ డీవియేషన్‌కు 25 శాతం అధికంగా విధిస్తున్న ఆస్తి పన్నుపై పరిశీలన చేయాలని సూచించారు. ఆక్యుపెన్సీ, మార్ట్ గేజ్ జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవనాలకు పోస్ట్ వెరిఫికేషన్ వేగంగా పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సిటీప్లానర్‌ని ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్డులో డ్రైనేజీ లెవల్స్‌ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. గోరంట్ల తాగునీటి పథకానికి సంబంధించి సమగ్రంగా నీరు అందేలా తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో మరో ఫిల్టరేషన్ ప్లాంట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏసీపీలు, క్రెడాయ్ ప్రతినిధులు శివారెడ్డి, రాము, నేరేడ్కో క్యాపిటల్ జోన్ ప్రతినిధులు నాగవంశీ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

లోన్ మంజూరు పేరుతో ఆన్‌లైన్‌లో మోసం

పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ

పెదకాకాని: రుణం మంజూరు చేస్తామని ఆన్‌లైన్‌లో నమ్మించి మోసం చేయడంపై పెదకాకాని పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. గడ్డిపాడులో నివాసం ఉంటున్న చింతకాయల శివనంది ఆన్‌లైన్‌లో ముద్ర అసోసియేట్స్ పేరుతో ఉన్న సంస్థకు ఫోన్ చేసి లోన్ గురించి వివరాలు అడిగింది. కొంతసేపటి తర్వాత ముద్ర అసోసియేట్స్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి లోన్ ఇస్తామని నమ్మబలికారు. లక్ష రూపాయలు రుణం ఇస్తామని, ముందుగా ఫీజ్ చెల్లించాలంటూ ఆమె వద్ద నుంచి రూ. 2250 మొదలుపెట్టి దశల వారీగా 1,03,500 ఫోన్ పే చేయించుకున్నారు. అడ్రస్ ప్రూఫ్స్ పంపించాలని అడుగుతూనే మళ్లీ నగదు ఫోన్ పే చేయాలని కోరడంతో అనుమానం వచ్చి తెలిసిన వారిని విచారించింది. ముద్ర అసోసియేట్స్ అనేది మోసపూరిత సంస్థని వారు చెప్పడంతో మోసపోయానని గ్రహించి పెదకాకాని పోలీసులు ఆశ్రయించింది. బాధితురాలు చింతకాయల శివనంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

రేపు కానుకల లెక్కింపు

చేబ్రోలు: పట్టణంలో ప్రఖ్యాతి గాంచిన సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీల్ని శుక్రవారం ఉదయం లెక్కించనున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి తుల్లిమిల్లి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. దేవస్థాన ప్రాంగణంలోని ఆరు దేవాలయాల్లో మొత్తం 20 హుండీలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఆలయ అధికారులు సమక్షంలో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు హుండీల లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

శ్రీ కొత్తూరు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేటు వారి దివ్యసముఖమునకు CC 87/2015 పతివాడ గ్రేసమ్మ నీవు పతివాడ వెంకటమ్మ వగైరాలుపై వేసిన కేసు వాయిదా తే. 28-07-2023 దికు ఉన్నది. నీవు రాకపోతే నీ కేసు కొట్టివేస్తారని డైరెక్షను ఇచ్చారు. నీవు తప్పక రావలెను.

గేదెల ఫల్గుణరావు, అడ్వకేటు, పాతపట్నం, శ్రీకాకుళం జిల్లా
సెల్: 9440420747, 8978498840

ప్రగడ కోటయ్య సేవలు చిరస్మరణీయం



కోటయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం చేనేత సూర్యుడు ప్రగడ కోటయ్య సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కొనియాడారు. నగరంలోని ఆటోనగర్ ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో బుధవారం చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య 108వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ చేనేత రంగంలోని సమస్యల పరిష్కారం కోసం ప్రగడ కోటయ్య జీవితాన్ని ధారబోశారని కొనియాడారు. చేనేత సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తన వాణిని వినిపించి సొసైటీల ఏర్పాటుకు విశేష కృషి చేశారన్నారు. అనంతరం కార్గిల్ అమరవీరుల త్యాగాల్ని స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్, పారేపల్లి మహేష్, రజక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, మల్లవరపు సుధారాణి, గుంటి విజయలక్ష్మి, గుత్తికొండ రామకృష్ణారెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో...

నగరంలోని పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో ప్రగడ కోటయ్య జయంతి వేడుకలు బుధవారం సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి హాజరై ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.